రోల్డ్ గోల్డ్ ధగధగలు

- రంజాన్ మార్కెట్‌లో ఆకట్టుకుంటున్న రోల్డ్ గోల్డ్ నగలు
- సాధారణ రోజుల కన్నా పెరిగిన గిరాకీ..
- చైన్ స్నాచింగ్ బెడద లేని నగలు.. అందుకే మక్కువ ఎక్కువ



చార్మినార్ వద్ద బండిపై విక్రయిస్తున్న గిల్ట్ నగలు



చార్మినార్: రంజాన్ మార్కెట్‌లో రోల్డ్ గోల్డ్ నగలు మహిళలను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. తక్కువ ఖరీదు..అందానికి అందం. పూర్తిగా బంగారాన్ని పోలిన రోల్డ్ గోల్డ్ నగలకు మహిళల్లో ఆదరణ పెరిగింది. ప్రస్తుతం బంగారం ధరలు ఆకాశాన్ని తాకాయి. పెళ్లిళ్ల సీజన్, దిగువ మధ్యతరగతితో పాటు దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న ప్రజలకు ఈ రోల్డ్ గోల్డ్ నగలు ఎంతో మేలు చేస్తున్నాయి. పెళ్లిళ్లు పేరంటాళ్లకు వెళ్లడానికి మహిళలకు బంగారు నగలు లేవనే బాధ లేకుండా ఈ రోల్డ్ గోల్డ్ నగలు పనికొస్తున్నాయి. గిల్ట్ నగలు (రోల్డ్ గోల్డ్).. ధగధగ మెరుస్తూ.. మనస్సును ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. పేద, గొప్ప అనే తేడాలు లేకుండా ప్రతిఒక్కరూ ప్రస్తుతం వీటినే ధరిస్తున్నారు. అక్కడక్కడ చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండటంతో రోజువారీగా మహిళలు వీటినే విరివిరిగా వినియోగిస్తున్నారు. కేవలం వివాహాది శుభకార్యాల్లో మాత్రమే బంగారు నగలను వాడుతున్నారు. గిల్ట్ నగలతో దొంగల భయం లేకపోవడంతో వీటికి రాను రాను మహిళల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో చార్మినార్–లాడ్‌బజార్‌లోని రంజాన్ మార్కెట్‌లో వీటికి గిరాకీ చాలా పెరుగుతుంది.

ఆకర్షణీయమైన డిజైన్లలో..

ఆకర్షణీయమైన డిజైన్లలో.. రంగురంగుల మెరుపు రాళ్ల(స్టోన్స్)తో తయారైన ఈ నగలు మగువల మనస్సు దోచడమే కాకుండా చూపరుల దృష్టిని అమాంతం ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం బంగారం ధరలు సామాన్యులకు అందుబాటులో లేనంతగా పెరుగుతుండడంతో.. గిల్ట్ నగలకు గిరాకీ పెరిగింది. మహిళల ఆదరణ చూసిన మార్కెట్ వర్గాలు రకరకాల గిల్ట్ నగలను మార్కెట్‌లోకి తెస్తున్నారు. ఉంగరాలు, చెవి పోగులు, కమ్మలు, దిద్దులు, నల్లపూసల తాడు, పుస్తెల తాడు, నెక్లెస్, ఒంకు, వడ్డానం, పచ్చలు, కెంపుల హారాలు..ఇలా ఒకటేమిటి రూ.50ల నుంచి రూ.5 వేల వరకు ఈ నగలు అందుబాటులో ఉన్నాయి.

బంగారు నగలకు తీసిపోని విధంగా..

బంగారు నగలకు ఏమాత్రం తీసిపోని విధంగా అసలుకు దీటుగా మార్కెట్‌లో ఈ నగలు సందడి చేస్తున్నాయి. సామాన్యులు 2 తులాల నెక్లెస్ చేయించుకోవాలంటే.. ఇప్పుడున్న ధరల్లో అయితే రూ.1.20 లక్ష అవుతుంది. అదే నెక్లెస్‌ను గిల్ట్ నగల్లో అయితే.. రెండు వందల్లో ఖరీదు చేసుకుంటున్నారు. పాతబస్తీలోని లాడ్‌బజార్, చార్మినార్, పత్తర్‌గట్టి, మదీనా, శాలిబండ, మదీనా, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలతో పాటు టేలాబండిల్లో ఈ నగలు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం పాతబస్తీలో ప్రత్యేక షో రూంలున్నాయి. ప్రస్తుతం రంజాన్ మార్కెట్ సందర్భంగా టేలా బండ్లపై గిల్టీ నగల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

క్లుప్తంగా

నేడు 'ఇటా' ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

గోల్కొండ: ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామని ఐటా షేక్‌పేట్ మండల అధ్యక్షులు మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అన్నారు. నేడు సాయంత్రం 6 గంటలకు టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉంటుందని ఐటాకు చెందిన హిందూ సోదరులే కాకుండా ట్రాఫిక్, జలమండలి తదితర శాఖల అధికారులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

అల్పాహారం పంపిణీ



జియాగూడ: నగరంలోని పలుచోట్ల వేసవి కాలం దృశ్యం అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ఆకుల రవీందర్‌రావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఉస్మానియా, జర్జిఖానా, నీలోఫర్, ఫీవర్ ఆస్పత్రి, సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతాల్లో నిరుపేదలకు అల్పాహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తాడిశెట్టి నవీన్ ఆనంద్, లయన్ ప్రసన్న, లయన్ వీంద్రన్, శ్రవణ్ పాల్గొన్నారు.

'ఓబీసీ కుల గణనపై మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలి'

చార్మినార్: పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించే బహిరంగ సభలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ కుల గణనపై తన వైఖరిని స్పష్టం చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఎ.రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రధాని తన ప్రసంగంలో ఓబీసీ సమస్యలపై స్పందించకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఓబీసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న ఓబీసీలకు అసెంబ్లీ, పార్లమెంటులో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వెంటనే పార్లమెంటులో ఆమోదించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలోనే నామినేటెడ్ పదవుల్లో ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు.

గౌరీ లక్ష్మీబాయికి ఆహ్వానం



యువరాణి గౌరీ లక్ష్మీబాయికి అమ్మవారిని ఫొటోను అందజేస్తున్న ఆలయం ట్రస్టీ శశికళ

చార్మినార్: తిరువనంతపురంలోని వడియార్ ప్యాలెస్‌లో శ్రీ మధుర దాస్ ట్రావెన్‌కోర్ యువరాణి గౌరీ లక్ష్మీబాయిని శనివారం చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్టీ శశికళ మర్యాదపూర్వకంగా కలిశారు. చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకోవాలని ఆమెకు భాగ్యలక్ష్మి అమ్మవారి ఫొటోను బహూకరించి ఆహ్వానించారు.

గోవులను కాపాడిన గో రక్షకులు



అబిడ్స్: అక్రమంగా గో వధ శాలలకు తరలిస్తున్న 161 గోవులను గో రక్షాదళ్ సభ్యులు, టీటీడీ గో రక్షాదళ్ సభ్యులు కాపాడారు. గో రక్షాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాలుసింగ్, దీపక్ సింగ్, టీటీడీ గోశాల బోర్డు సభ్యులు కోటి శ్రీధర్ ఔటర్ రింగ్‌రోడ్డుపై రోడ్డు సమీపంలో అక్రమంగా రెండు వాహనాల్లో తరలిస్తున్న గోవులను స్థానికుల పోలీసుల సహకారంతో కాపాడారు. రక్షించిన గోవులను జియాగూడలోని గోశాలకు తరలించినట్లు కోటి శ్రీధర్ తెలిపారు. శంకర్‌సింగ్, కేదర్ సింగ్, సతీష్ సింగ్, సందీప్, నర్సింగ్ ఉన్నారు.

గుంతలమయంగా శంషీర్‌గంజ్ రహదారి

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి నుంచి శంషీర్‌గంజ్ వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఏడాది క్రితమే నూతన రోడ్డు మంజూరయ్యిందని పేర్కొంటున్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. రైస్ మిల్లులు, ఇతర కంపెనీలు ఉన్న ఈ రూట్‌లో నిత్యం పెద్ద ఎత్తున లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శోభాయాత్రల కోసమని తాత్కాలికంగా ఈ గోతులలో డస్ట్ పౌడర్‌ను నింపారు. ప్రస్తుతం ఈ రహదారిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో వెలువడుతున్న దుమ్ము, ధూళితో స్థానిక వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రూట్‌లో రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.

'దళితరత్న ఇవ్వడం గర్వంగా ఉంది'



సత్యనారాయణను సన్మానిస్తున్న పలు సంఘాల ప్రతినిధులు



అవార్డు అందుకుంటున్న నాగేష్

జియాగూడ: ప్రజా ఉపయోగ అభివృద్ధి సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు దళితరత్న అవార్డు ఇవ్వడం గర్వంగా ఉందని జియాగూడ ఇమాంపురా నవభారత సంఘం అధ్యక్షుడు మదిర సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం జియాగూడలోని నవభారత్ సంఘంలో పలు సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి సన్మానించి అభినందించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి రోజున రవీంద్రభారతి ఆడిటోరియంలో ప్రభుత్వం తనకు దళితరత్న అవార్డును ప్రకటించిందని తెలిపారు.

నాగేష్‌కు దళితరత్న అవార్డు..

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీకి చెందిన నాగేష్ దళితరత్న అవార్డును అందుకున్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా నగరంలో జరిగిన కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కమిటీ నాగేష్‌కు అవార్డును బహూకరించినట్లు ఆయన తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా సామాజిక రంగంలో నాగేష్ సేవలందిస్తున్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే: ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి



ఏవీఎన్ రెడ్డిని సన్మానిస్తున్న మధు సోమాని

సుల్తాన్‌బజార్: రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్సీ ఏవఎన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం సీనియర్ బీజేపీ నాయకులు మధు సోమాని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తుందని ఆరోపించారు. తమ ఉనికి కోసం బీజేపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ పార్టీని ప్రజలు నమ్ముతున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో విజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రతి ముస్లిం తప్పకుండా ఖురాన్ చదవాలి



మాట్లాడుతున్న ఎంబీటీ అధినేత మాజిదుల్లా ఖాన్

శాలిబండ: రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం తప్పకుండా ఖురాన్ చదవాలని ఎంబీటీ అధినేత మాజిదుల్లా ఖాన్ అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మక్కా మసీదులో శుక్రవారం ఎంబీటీ ఆధ్వర్యంలో జల్సా–ఇ–యౌముల్ ఖురాన్ సభను నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పాలస్తీనాలో రెండు రోజుల నుంచి ఖురాన్ చదివే వారిపై కాల్పులు జరుగుతున్నాయన్నారు. ప్రతి ముస్లిం రంజాన్ నెలలో తమ సంపాదన నుంచి జకాత్ తప్పకుండా తీయాలని.. తీసిన డబ్బులను అనాథలను మదర్సాలకు దానం చేస్తే పుణ్యం ఉంటుందని ఖురాన్‌లో రాసి ఉందన్నారు. సీఎం కేసీఆర్ వక్ఫ్ బోర్డు ఆస్తులను ముస్లింలకు చెందేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు.

ముగిసిన వీర హనుమాన్ జన్మోత్సవ వేడుకలు



వేడుకల్లో కార్పొరేటర్ లాల్‌సింగ్, శాంతిదేవి

అబిడ్స్: దారుసలాంలో దాల్‌మండి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వీర హనుమాన్ జన్మోత్సవ వేడుకలు శుక్రవారం ముగించారు. కార్పొరేటర్ లాల్‌సింగ్, సొసైటీ ప్రెసిడెంట్ శాంతిదేవి, ప్రేమ్ అగర్వాల్ ప్రత్యేక పూజలు చేసి ముగింపు వేడుకలు ఘనంగా చేపట్టారు.

పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆచార్య చెన్నకేశరెడ్డి జన్మదినం సందర్భంగా ప్రముఖ రచయిత డాక్టర్ ఎలనాగకు పురస్కారాన్ని శుక్రవారం రవీంద్రభారతిలో అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎలనాగ రచనలు ఎంతో సరళంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ సలహామండలి కన్వీనర్ ఆచార్య మ్రోణాళిని, తెలంగాణ భాషా సంస్కృతిక మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గంట జలేందర్ రెడ్డి, జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌కు ఆహ్వానం



కాసాని జ్ఞానేశ్వర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

గోల్కొండ: జ్యోతిబాపూలే భారతదేశం గర్వించదగ్గ మహిళలో ఒకరని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఈనెల 11న గుడిమల్కాపూర్‌లో జరగనున్న జ్యోతిబాపూలే జయంతి వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ కార్వాన్ బీసీ ఐక్యవేదిక నాయకులు ఆయనకు శుక్రవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ అడికి, బండారి వెంకటేష్, అనీల్‌కుమార్, నర్సింగరావు తదితరులున్నారు.

అన్ని వర్గాలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: అన్నివర్గాల ప్రజలకు అండగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జాంబాగ్ యూసుఫ్‌బాబా దర్గా వద్ద జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల పండుగలను ప్రభుత్వమే స్వయంగా చేపడుతుండడం గర్వకారణమన్నారు. మైనార్టీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉండి వారి సంక్షేమానికి, ప్రగతికి విశేష కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అహ్మద్, మహ్మద్ సలీమ్, ఫయాజ్, యూసుఫ్, అర్జున్, ఫిరోజ్, సాజీద్, అన్సారీ, అలీమ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

'ఇఫ్తార్ విందులు ఐక్యతకు చిహ్నంగా నిలుస్తున్నాయి'

గోల్కొండ: ఇఫ్తార్ విందులు ఐక్యతకు చిహ్నంగా నిలుస్తున్నాయని జమాత్ ఏ ఇస్లామి హింద్‌నగర అధ్యక్షుడు హాఫిజ్ మహ్మద్ అన్నారు. శుక్రవారం రేతిబౌలి మిలన్ గార్డెన్‌లో జరిగిన ఇఫ్తార్–గెట్ టు గెదర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. జమాతే ఇస్లామే హింద్ జాతీయ ఐక్యతకు ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. అంతే కాకుండా భారతీయుల మధ్య ఐక్యతను, సోదర భావాన్ని పెంపొందించేందుకు హిందూ ముస్లిం సోదరుల సమ్మేళనాలు, ఇఫ్తార్ గెట్ టు గెదర్‌లు నిర్వహిస్తుందని అన్నారు. జమాత్ ప్రతినిధులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



గోల్కొండ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



సీపీఆర్ డెమో నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే డాక్టర్ల అభిమతమని గోల్కొండ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహర్ ఉల్లా అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అత్యవసర సమయంలో ఒక వ్యక్తికి సీపీఆర్ ద్వారా ఏ విధంగా ప్రాణదానం చేయవచ్చో డెమో నిర్వహించారు. సీపీఆర్ అనేది అత్యవసర పరిస్థితిలో గుండెజబ్బును నివారించే పద్ధతి అని ఆయన అన్నారు. సీపీఆర్ ప్రత్యేక శిక్షణను తాము ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఖాజా మహ్మద్ రవూఫ్ ఉద్దీన్, డాక్టర్ గోపాల్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్వాన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: కార్వాన్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ అల్ హస్నాత్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో కొత్త తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్ డివిజన్‌లో అల్ హస్నాత్ కాలనీకి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయన్నారు. కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కాలనీ సంక్షేమ సంఘం వారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ వచ్చానన్నారు. కాలనీవాసులు సైతం కాలనీలో పచ్చదనం పెంపొందించడంతో పాటు హరిత హారం కార్యక్రమాన్ని విజయవంతంగా ఎన్నో మార్లు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఈ కాలనీ పార్కు బల్దియా వారిచే అత్యుత్తమ పార్కుగా అవార్డు పొందిందన్నారు. ఈ కాలనీ మరిన్ని అవార్డులు పొందేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షకార్యదర్శులు షేక్ అబ్దుల్లా, హిరాఫత్ అలీ బాక్రీ తదితరులున్నారు.

శాస్త్రీయ సంగీతం, లలిత కళలను పరిరక్షించాలి



నృత్య గురువులను సన్మానిస్తున్న జస్టిస్ రామలింగేశ్వరరావు తదితరులు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ సంగీతం, నృత్యం, లలితకళలు మన సంస్కృతిలో అంతర్భాగాలని, వాటిని పరిరక్షించి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని విశ్రాంత ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ భాషానిలయంలో నవ్య నాటక సమితి 65వ వార్షికోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ''భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య రీతుల ప్రసంగ పరంపర'' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువ ఔత్సాహిక కళాకారులకు వివిధ అంశాలపై ఎంతగానో ఉపయోగపడే విధంగా ప్రముఖ నాట్య గురువుచే ప్రసంగాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అభినయ పదమందారం–పదాభినయం అనే అంశంపై సధోహరణ ప్రసంగ చేసిన కేంద్రీయ విశ్వ విద్యాలయం నృత్య శాఖాచార్యులు డాక్టర్ అరుణ భిక్షును సమితి తరపున ఘనంగా సత్కరించారు. పదాభినయంపై అరుణ భిక్షు మాట్లాడుతూ.. నాటకీయతే కూచిపూడి నాట్య విశిష్టత అని పదాభినయం శృంగార రస ప్రధానమైందన్నారు. ఈ కార్యక్రమంలో చలపతి శాస్త్రి, వసుంధర, కళాకృష్ణలతో పాటు జంట నగరాలకు చెందిన నృత్య గురువులు ఇందిరా హేమ, రేణుకా ప్రభాకర్, స్నేహా రామ్‌చందర్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

అబిడ్స్: నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు నందకిశోర్ వాస్, బేగంబజార్ డివిజన్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్ కలిశారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో ఆయనకు వారు పుష్పగుచ్ఛం అందజేసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో పుల సమస్యలు, శాంతిభద్రతల విషయంలో కమిషనర్‌తో చర్చించినట్లు తెలిపారు. అన్ని విషయాలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన వివరించారు.



ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సంతోష్‌గుప్తా

అబిడ్స్: ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని పలు శాఖల అధికారులకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గుప్తా సూచించారు. గన్‌ఫౌండ్రీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీరు, ఇతర సమస్యలు సంబంధిత శాఖల అధికారులచే పరిష్కారం చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి, ప్రగతి వేగవంతంగా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, నరేష్‌గౌడ్, భజన్, నాగేష్, టింకు, అరవింద్, సుభాష్, రాము పాల్గొన్నారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కోసం పోరాడాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర అన్నారు. ఆలే జితేంద్ర ఆధ్వర్యంలో గురువారం రాత్రి భారీ శోభాయాత్రను నిర్వహించారు. గౌలిపురా మార్కెట్‌లోని హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర మొఘల్‌పురా, సుల్తాన్‌షాహీ, గౌలిపురా గాంధీ బొమ్మ, శ్రీరాంనగర్ కాలనీ, అయోధ్యనగర్, హనుమాన్‌నగర్‌లోని మంగళముఖి హనుమాన్ ఆలయం, ఛత్రినాక, లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ చౌరస్తా, హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న దేవాలయం, బేలా చౌరస్తా, గౌలిపురా మార్కెట్‌లోని దేవాలయానికి చేరుకుంది. ఈ శోభాయాత్రలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు రాకేశ్‌తివారీతో పాటు కె.ప్రేమ్ కిశోర్, జి.ఎం.జ్యోతికుమార్,, సాకెల్లి సర్వేశ్, కె.రాజ్ కుమార్, సాయి, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు. హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య ఆధ్వర్యంలో మొఘల్‌పురా, ఛత్రినాక, శాలిబండ, హుస్సేనీఆలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు బందోబస్తును ఏర్పాటు చేశారు.

దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తెలంగాణ



బలగం చిత్రబృందాన్ని సన్మానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

గన్‌ఫౌండ్రీ: కొత్త రాష్ట్రమైన తెలంగాణ అన్ని రంగాల్లో రాణిస్తూ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక రంగాల్లో అవార్డులు రావడమే అందుకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్ర సంగీత అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహిస్తున్న యువనిక నాటకోత్సవాలలో భాగంగా రెండో రోజు అయిన శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో విస్మరించబడిన కళలను గుర్తించి వాటికి తగిన గుర్తింపును ఇస్తున్నట్లు తెలిపారు. బలగం సినిమా ఎంతో అద్భుతంగా ఉందని కొనియాడారు. అనంతరం బలగం చిత్ర బృందాన్ని ఘనంగా సన్మానించారు. అంతకు ముందు శారద నాట్య మండలి ఆధ్వర్యంలో ఫ్రీడం ఫైటర్, హైదరాబాద్ జానపదం ఆధ్వర్యంలో 'పరాయి'నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సినీ నటీ ఝాన్సీ, సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బలగం చిత్ర దర్శకుడు వేణు, హీరోయిన్ కావ్య, రచయిత శ్యామ్ పాల్గొన్నారు.

'అమ్మా భారతి వందనం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిణి ఆధ్వర్యంలో రచయిత మద్దాలి రఘురామ్ రచించిన 'అమ్మా భారతి వందనం'పుస్తకావిష్కరణ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. రఘురామ్ సాంస్కృతిక రంగంతో పాటు సాహిత్య అభివృద్ధికి కూడా కృషి చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. అనంతరం హంస అవార్డు గ్రహీత ఉష గాయత్రికి పుస్తకాన్ని అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వర్‌రావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్ రావు, మాజీ శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రకాష్, సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, యువకళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.